## పీఎస్ఎల్వీ వైఫల్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు..
# కమిటీని నియమించిన కేంద్రం

ఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఇటీవల చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగం విఫలం కావడంపై కేంద్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధానికి గతంలో ముఖ్య శాస్త్రీయ సలహాదారుగా పనిచేసిన కె. విజయరాఘవన్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ కో-ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ఏడాది జనవరి 12న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించిన విషయం తెలిసిందే. అయితే, మూడో దశ సాలిడ్ మోటారులో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది. ఈ ఘటనలో డీఆర్‌డీఓకు చెందిన కీలకమైన 'అన్వేష' ఉపగ్రహంతో పాటు మొత్తం 16 ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరలేదు. పీఎస్ఎల్వీ రాకెట్ వరుసగా రెండోసారి విఫలం కావడంతో కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. గతంలో 2025 మే నెలలో ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ61 కూడా దాదాపు ఇలాంటి కారణాలతోనే విఫలమైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజా వైఫల్యంపై దర్యాప్తునకు ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీ సభ్యులు ఇప్పటికే శ్రీహరికోటలోని షార్ కేంద్రాన్ని, తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌ను సందర్శించి విచారణ ప్రారంభించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్తులో చేపట్టే ప్రయోగాలపై ఇస్రో నిర్ణయం తీసుకోనుంది.

# భివాండి కోర్టులో రాహుల్ గాంధీకి ఊరట

ఢిల్లీ: 2014 నాటి పరువు నష్టం కేసులో మహారాష్ట్రలోని భివాండి కోర్టులో లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆరెస్సెస్‌పై నాడు చేసిన వ్యాఖ్యలకు గాను ఆయనపై మహారాష్ట్రలో కేసు నమోదైంది. ఈ కేసుపై కోర్టులో జరిగిన విచారణకు రాహుల్ గాంధీ ఈరోజు హాజరుకాగా, బెయిల్ లభించింది. 2014 లోక్ సభ ఎన్నికల సమయంలో మహారాష్ట్రలోని సోనాలే గ్రామంలో జరిగిన ర్యాలీలో ఆరెస్సెస్‌పై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. మహాత్మా గాంధీ హత్య వెనుక ఆరెస్సెస్ హస్తం ఉందని అన్నారు. అయితే రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఆరెస్సెస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంటూ ఆరెస్సెస్ కార్యకర్త రాజేశ్ కోర్టులో ఫిర్యాదు చేశారు.

## ఏఐ సమ్మిట్ లో షర్ట్‌లెస్ నిరసన.. చొక్కాలేని గాంధీజీ ఫొటోతో సమర్థించుకున్న యూత్ కాంగ్రెస్

ఢిల్లీ: ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో యూత్ కాంగ్రెస్ సభ్యులు చేపట్టిన షర్ట్‌లెస్ నిరసనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తగా, ఆ సంస్థ ఇప్పుడు తమ చర్యను వినూత్నంగా సమర్థించుకుంది. మహాత్మా గాంధీ ఫొటోను సోషల్ మీడియాలో పంచుకుంటూ తమ నిరసన సరైనదేనని చెప్పే ప్రయత్నం చేసింది. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఇండియా-ఏఐ సమ్మిట్‌లో పలువురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఈ నిరసనకు దిగారు. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఇండో-యూఎస్ వాణిజ్య ఒప్పందం వంటి అంశాలపై ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. సదస్సు జరుగుతున్న ప్రాంగణంలోనే తమ చొక్కాలు విప్పి, (ప్రధాని రాజీపడ్డారు)" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఇండియా ఏఐ సమ్మిట్ డిస్‌ప్లే బోర్డు ముందు నిలబడి ఫొటోలు తీయడంతో కొంత గందరగోళం ఏర్పడింది. అంతర్జాతీయ ప్రతినిధులు హాజరైన ఈ సదస్సులో కాంగ్రెస్ పార్టీ దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని బీజేపీ, ఎన్డీఏ నేతలు తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో, యూత్ కాంగ్రెస్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో స్పందించింది. 'షర్ట్‌లెస్ కాంగ్రెసీ' అనే ట్యాగ్‌తో ఉన్న గాంధీజీ చిత్రపటాన్ని షేర్ చేస్తూ, "మేము గాంధీజీ వారసులం, షర్ట్‌లెస్ అయినా ఫర్వాలేదు" అని హిందీలో రాసుకొచ్చింది. నిరసనకారులను భద్రతా సిబ్బంది వెంటనే అదుపులోకి తీసుకుని సదస్సు ప్రాంగణం నుంచి బయటకు పంపించారు. ప్రపంచస్థాయి సదస్సులో ప్రచారం కోసమే కాంగ్రెస్ ఈ చర్యకు పాల్పడిందని అధికార పక్షం ఆరోపిస్తుండగా, ప్రజాస్వామ్యంలో ఇది నిరసన తెలిపే హక్కులో భాగమేనని విపక్ష నేతలు వాదిస్తున్నారు.

## అగ్రి షో వంటి కార్యక్రమాలు ప్రభుత్వం
# నిర్వహిస్తే మేలు జరుగుతుంది: హరీశ్ రావు

హైదరాబాద్: రైతుబడి అగ్రి షో వంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తే రైతులకు మేలు జరుగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు. సాగు పనిముట్లకు రాయితీపై రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చిస్తామని హరీశ్ రావు వెల్లడించారు. అగ్రి వంటి కార్యక్రమాలు రైతులకు అన్ని రకాలుగా దోహదపడుతాయని అన్నారు. ఈ అగ్రి షో కార్యక్రమంలో రైతుబడికి చెందిన రాజేందర్ రెడ్డి మాజీ మంత్రి హరీశ్ రావుపై ప్రశంసలు కురిపించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో స్వయంగా తనకు ఫోన్ చేసి సాగర్‌లో స్థానిక పరిపాలన లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీని మీద వార్తలు రాస్తే దాని ఆధారంగా చర్యలు తీసుకుంటానని తనకు చెప్పారని గుర్తుచేసుకున్నారు. అప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద పాలన ఉండేదని అన్నారు. ఆ సమయంలో తాను రెండు మూడు వార్తలు రాశానని, మిగతా మీడియా కూడా స్పందించి వార్తలు రాసిందని అన్నారు. వాటి ఆధారంగా హరీశ్ రావు నాగార్జున సాగర్‌ను మున్సిపాలిటీగా చేసి స్థానిక పాలన జరిగేలా చేశారని గుర్తు చేసుకున్నారు.

## ఈ నెల 26 నుంచి జనసేన
# ఉద్యమి సభ్యత్వాలు..

అమరావతి: జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆ పార్టీ మరో కీలక అడుగు వేస్తోంది. జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఈ ప్రణాళికపై పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన జనసేన అగ్రనేత, మంత్రి నాదెండ్ల మనోహర్... క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెండు వారాల సమయాన్ని వినియోగించుకుని సమష్టిగా భారీగా సభ్యత్వాలను చేయించేలా లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించనున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి స్పష్టమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపితే పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలని... కొత్త సభ్యుల చేరికపై దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో 12.6 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని... ఈసారి రెట్టింపు సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు.

## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన
# దిగ్భ్రాంతి కలిగించింది

అమరావతి: ఢిల్లీలో నిన్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సృష్టించిన గందరగోళంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం, విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై వారి ప్రవర్తన దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఏఐ రంగంలో ఎదుగుతున్న భారత్ శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఉద్దేశించిన సదస్సులో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ప్రదర్శించేందుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశం. అలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం ద్వారా ప్రపంచం ముందు మనందరి ప్రతిష్ఠను తగ్గించారు. ఇది దిగ్భ్రాంతికరం, విచారకరం" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం ఇంతకంటే మెరుగైన గౌరవానికి అర్హమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం ఇలాంటి చిల్లర రాజకీయాలను పక్కనపెట్టి, ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్ఠకు సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

## కాంగ్రెస్ నేతలు బట్టలు విప్పి
# తిరగడం దారుణం



ఢిల్లీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సదస్సులో కాంగ్రెస్ నేతలు బట్టలు విప్పి నిరసన తెలపడం తనను తీవ్రంగా ఆవేదనకు గురిచేసిందని అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని 60కి పైగా దేశాలు తమ ఆవిష్కరణలతో పాల్గొన్న అంతర్జాతీయ సదస్సులో ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన ఈ పనులు దేశ ప్రతిష్ఠకు నష్టం కలిగిస్తాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. టెక్నాలజీని స్వాగతించాల్సింది పోయి, ఇలాంటి నిరసనలు చేయడం దారుణమని పేర్కొన్నారు. తాను ఇటీవల ఢిల్లీ ఏఐ సదస్సుకు హాజరయ్యానని, వైద్యం, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో టెక్నాలజీ వినూత్న మార్పులు తీసుకురాబోతోందని వివరించారు. టెక్నాలజీని ప్రజల మేలు కోసం వినియోగించడం తనకు అలవాటని స్పష్టం చేశారు. రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ త్వరలో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. వ్యవసాయంలోనూ టెక్నాలజీని తీసుకొచ్చి సాగును సులభతరం చేస్తామని హామీ ఇచ్చారు.

# సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని సూపర్ హిట్ చేసి చూపించాం

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల సేకరణ కోసం ఏర్పాటు చేసిన 'స్వచ్ఛ రథాన్ని', ఈ-ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు.

**దేశంలోనే ఏపీ అగ్రగామి**

ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. "దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి దరిదాపుల్లో లేనంత సంక్షేమాన్ని అందిస్తున్నాం. మొదటి తారీఖునే పేదల సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొంటున్నాను. 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఆర్థిక సాయం అందిస్తున్నాం. 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు మూడు విడతల్లో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం" అని వివరించారు.

**మహిళా సాధికారత, ప్రజల భాగస్వామ్యం**

మహిళల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. "స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వారు ఈ పథకాన్ని చక్కగా వినియోగించుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. లక్ష మంది మహిళలను ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు. పీ4 కార్యక్రమం కింద ఇప్పటివరకు 10 లక్షల కుటుంబాలను దత్తత తీసుకున్నామని, వారికి మార్గనిర్దేశం చేసేందుకు లక్ష మంది మార్గదర్శులు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 561 స్వయం సహాయక సంఘాలకు రూ.100.14 కోట్ల చెక్కును అందించారు.

**టెక్నాలజీతో సుపరిపాలన**

పౌర సేవల్లో టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. "దేశంలో ఏ రాష్ట్రం కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందించడం లేదు. త్వరలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో శిక్షణ ఇచ్చేందుకు ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నాం. ఇటీవల బిల్ గేట్స్ కూడా రాష్ట్రానికి వచ్చి రైతులు టెక్నాలజీని వినియోగిస్తున్న తీరును చూసి ఆనందం వ్యక్తం చేశారు" అని గుర్తుచేశారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు.

**ఆరోగ్యానికి భరోసా, వ్యవసాయానికి చేయూత**

ప్రజల ఆరోగ్యం కోసం యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకువస్తున్నామని, పేద కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. వ్యవసాయంలోనూ టెక్నాలజీని ప్రవేశపెట్టి సాగును సులభతరం చేస్తామన్నారు. రైతులు పండించే పంటలకు మార్కెట్ ధర అందేలా, సాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినుకొండను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ఆలోచన ఉందన్నారు.

**స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా పటిష్ఠ చర్యలు**

స్వచ్ఛమైన వాతావరణం కల్పించడమే 'స్వచ్ఛాంధ్ర' లక్ష్యమని సీఎం అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోందన్నారు. "గత పాలకులు వదిలేసిన 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించే బృహత్తర కార్యక్రమం చేపట్టాం. మార్చి నాటికల్లా గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ పూర్తి చేస్తాం" అని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని, దీనివల్ల పశువులు, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని వివరించారు.

**చెత్త నుంచి సంపద.. మారాల్సిన తీరు**

చెత్తను సంపదగా మార్చే ప్రక్రియను ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "విశాఖ, గుంటూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రితో పాటు మరో 5 ప్లాంట్లు త్వరలో ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో 4 లక్షలకు పైగా కుటుంబాలు హోం కంపోస్టింగ్ ద్వారా ఎరువు తయారు చేసుకుంటున్నాయి" అని ప్రశంసించారు. చెత్త నిర్వహణలో జపాన్ పౌరుల తరహాలో మన ఆలోచనా తీరు మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో వార్ రూమ్ నిర్వహిస్తాం..

మొదటి పేజి తరువాయి

ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కృత్రిమ మేధ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని అన్నారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో గుర్తుచేశారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని అన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానవ మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని చెప్పారు. దేశానికి తక్షణ జాతీయ ఏఐ రోడ్‌మ్యాప్ అవసరమని నొక్కిచెప్పారు. ఏఐ అభివృద్ధి ప్రతి దశలో భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్రం, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ 'ఏఐ వార్ రూమ్'ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు.

ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సీఎం కోరారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని, అయితే సరైన రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ సృష్టించే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని సీఎం ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని కోరారు. ఏఐ అభివృద్ధి, సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా ఉండాలని సూచించారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్‌లో ఏ లిస్టులూ ఉండవ్..
# కేవలం మెరిట్ లిస్టే

అనంతగిరి: కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. " మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. నేను పీసీసీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేది. పార్టీలోనూ కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాను. నేతలందరినీ కలిసి నా ఆలోచన చెప్పి.. అందర్నీ ఒప్పించాను. అందరం కృషి చేయడంతో పార్టీ ఓటింగ్ పెరిగింది. డీసీసీ అధ్యక్షులుగా బాగా పని చేసిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాం. ఎమ్మెల్యే టికెట్లు పొందలేని వారికి ఎమ్మెల్సీలు ఇచ్చాం. పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుంది. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చు" అని రేవంత్ రెడ్డి అన్నారు.

## పరీక్షలు ఉన్నాయని
# ఆందోళన వద్దు

మొదటి పేజి తరువాయి

ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో ఆందోళనకు గురికాకుండా ఎంత వస్తే అంత రాయాలని సూచించారు. ఫలితాల కోసం ఏమాత్రం ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు బాగా రాయలేనేమోననే ఆందోళనతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త చూశానని, కాబట్టి ఫలితాల గురించి భయపడవద్దని అన్నారు. పరీక్షలు అనేవి జీవితంలో చిన్న పందెమని గుర్తుంచుకోవాలని సూచించారు. ఒక పరీక్ష సరిగ్గా రాయకుంటే మన జీవితం అంతటితో ఆగిపోదని అన్నారు. పరీక్షల తర్వాత ఎంతో జీవితం ఉందని వ్యాఖ్యానించారు. పరీక్షల భయంతో ఏదైనా చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షోభిస్తారో గుర్తుంచుకోవాలని అన్నారు. పరీక్షల వంటి చిన్న చిన్న అంశాలను దాటుకుంటూ వెళితే జీవితంలో పెద్ద పెద్ద వాటిని సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

## ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహార శైలిపై జగన్ విమర్శలు

అమరావతి: ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో నిన్న మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎగ్జిబిషన్ హాల్ నంబర్-5 వద్ద నిరసనకు దిగారు. పదుల సంఖ్యలో వచ్చిన కార్యకర్తలు హఠాత్తుగా టీ-షర్టులు విప్పేసి భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారి టీ-షర్టులపై 'ఎప్‌స్టీన్ ఫైల్స్', 'మోదీ రాజీపడ్డారు' వంటి వాక్యాలు, ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫొటోలు ముద్రించి ఉన్నాయి. సదస్సుకు హాజరైన కొందరు ప్రతినిధులు నిరసనకారులను ప్రశ్నించగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. వెంటనే భద్రతా సిబ్బంది జోక్యం చేసుకుని నిరసనకారులను అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటన సదస్సు ప్రాంగణంలో కలకలం రేపింది. ఈ ఘటనపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఏఐ సమ్మిట్ లో మనమంతా సిగ్గుపడేలా యూత్ కాంగ్రెస్ వ్యవహరించిందని మండిపడ్డారు. మన రాజకీయాలు ఎటువైపు వెళుతున్నాయని ప్రశ్నించారు. మన దేశాన్ని ఎవరూ, ఎప్పుడూ కించపరచకూడదని చెప్పారు. మన మధ్య ఎలాంటి రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ... ప్రపంచం ముందు అందరం ఐక్యంగా ఉండాలని అన్నారు.

## ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...
# న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం

మొదటి పేజి తరువాయి

మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశిస్తోంది. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు. ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.

## నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి
# పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది: రేవంత్ రెడ్డి

హైదరాబాద్: తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్ నిరసనలపై కేటీఆర్ స్పందన

హైదరాబాద్: ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026 వేదిక వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన నిరసనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని అభివర్ణించారు. అంతర్జాతీయ సదస్సులు దేశ ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించే వేదికలని అన్నారు. ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని చెప్పారు. రాజకీయ విభేదాలు సహజమే అయినా... అభిప్రాయ భేదాలను వ్యక్తపరచడానికి సరైన సమయం, సరైన వేదిక ఉండాలని కేటీఆర్ అన్నారు. గ్లోబల్ ఈవెంట్‌లలో ఇలాంటి నిరసనలు చేపట్టడం వల్ల భారత్‌పై అంతర్జాతీయంగా ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని విమర్శించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేయడం చాలా విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.

## 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి.. మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమో:

ఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ)ని అదుపుచేసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోననే భయం తనకు ఉందని అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యా సంస్థను, గురువులను మరిచిపోకూడదని అన్నారు. మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. యువత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మన పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలని వ్యాఖ్యానించారు. భారత్ విశ్వగురువు అయినప్పటికీ ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదని గుర్తు చేశారు. భారత్ సత్తాను ప్రపంచ వేదికల మీద మన వారు చాటుతున్నారని ప్రశంసించారు. కులం కంటే గుణం మిన్న అనే విషయాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. డిగ్రీల కంటే పరిజ్ఞానం ముఖ్యమని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

## ఏఐసీసీ అంటే 'యాక్టింగ్ ఈజ్ కాంగ్రెస్ కల్చర్': బండి సంజయ్


కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏఐసీసీ అంటే 'ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ' కాదని, 'యాక్టింగ్ ఈజ్ కాంగ్రెస్ కల్చర్' అని ఆయన కొత్త నిర్వచనం ఇచ్చారు. ఢిల్లీ నుంచి తెలంగాణ వరకు కాంగ్రెస్ నేతలకు ప్రజలకు సేవ చేయడంపై కాకుండా, నటించడంపైనే శిక్షణ ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఇచ్చిన 420 హామీలను అమలు చేసినట్లు, తీవ్రమైన భావోద్వేగంతో ఉన్నట్లు కాంగ్రెస్ నాయకులు నటిస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న డీసీసీ శిక్షణా తరగతులు పాలనపై సమీక్షల్లా కాకుండా, నటన నేర్పే వర్క్‌షాప్‌ల వలే ఉన్నాయని బండి సంజయ్ విమర్శించారు. నిజంగా ప్రజలకు సేవ చేసి ఉంటే ఈ రిహార్సల్స్ అవసరం ఉండేది కాదని, మార్పును ప్రజలే నేరుగా గమనించేవారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ స్క్రిప్ట్ ఎప్పుడూ ఒకేలా ఉంటుందని, అందులో గాంధీ కుటుంబమే హీరో అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఒకే కుటుంబం యాజమాన్యంలో నడిచే షెల్ కంపెనీగా మారిపోయిందని ఆయన ఆరోపించారు.

## నా కుమారుడి వ్యాఖ్యలను వక్రీకరించారు: జేసీ ప్రభాకర్ రెడ్డి

తన కుమారుడు అస్మిత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కొంతమంది జర్నలిస్టులు వక్రీకరిస్తున్నారని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని అస్మిత్ రెడ్డి అన్న మాటలను కొందరు జర్నలిస్టులు వక్రీకరించారని మండిపడ్డారు. జగన్ హయాంలో తెచ్చిన అప్పులకు తమ ప్రభుత్వం వడ్డీ కడుతోందని చెప్పారు. తాడిపత్రిలో జరుగుతున్న అభివృద్ధి గురించి జగన్‌కు తెలియదని... ఆయనకు చెప్పాల్సిన అవసరం కూడా లేదని అన్నారు. అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నేర్పించిన విజన్‌తో తాము బతుకుతున్నామని... ఆయన రాత్రి పగలు లేకుండా రాష్ట్ర అభివృద్ధికి శ్రమిస్తున్నారని కితాబునిచ్చారు. మంత్రి నారా లోకేశ్ సహా కూటమి నేతలు అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులను నిర్లక్ష్యంగా వదిలేశారని విమర్శించారు.ఏప్రిల్ నాటికి తాడిపత్రికి సోలార్ విద్యుత్ వస్తుందని చెప్పారు. కడప, కర్నూల్‌లో లేని విధంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తాడిపత్రిలో ఉందని తెలిపారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లే తాము తాడిపత్రి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

నిజం దృష్టి తెలుగు న్యూస్
సోమవారం 23-02-2026

## బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాలపై పాంప్లెట్ ఆవిష్కరణ






**నిజం న్యూస్ శేర్లింగంపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 22:** మన దేశ అభివృద్ధి దిశగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో, +శీజవతీఅవత్ శీట ×అఐఋ అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించేందుకు బీజేపీ మదీనాగూడ డివిజన్ నుండి ప్రత్యేక పాంప్లెట్‌ను ఈ రోజు శేరిలింగంపల్లి కాంటెస్టెడ్ మీూా రవి కుమార్ యాదవ్ చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అమలు అవుతున్న పథకాలు గృహ, ఆరోగ్య, రైతు, మహిళా సాధికారత, యువజన ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అనేక రంగాలలో ప్రజలకు నేరుగా లాభం చేకూర్చుతున్నాయి. ఈ పథకాల గురించి ప్రతి కుటుంబానికి స్పష్టమైన సమాచారం చేరేలా చేయడం మన బాధ్యత. ఈ పాంప్లెట్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల పూర్తి వివరాలు, అర్హతలు, పొందే విధానం గురించి సులభంగా తెలుసుకోవచ్చు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబ అభివృద్ధికి దోహదం చేసుకోవాలని కోరుకుంటున్నాం.మన ప్రాంతం మన అభివృద్ధి మన బాధ్యత.బీజేపీతో కలిసి ముందుకు సాగుదాం.

## 'మన్ కి బాత్'131 వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని మూసాపేట్ డివిజన్

### ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చారి నివాసంలో వీక్షించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు: వడ్డేపల్లి రాజేశ్వరరావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 22:** భారత ప్రధాని నరేంద్ర మోడీ మనసులోని మాటలతో రూపొందిన 'మన్ కీ బాత్' కార్యక్రమం 131వ ఎపిసోడ్‌ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈరోజు మూసాపేట్ డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీలో, డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చారి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మాధవరం కాంతారావు , అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు , నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరై ప్రధాని సందేశాలను శ్రద్ధగా వినడం జరిగింది. ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా దేశ ప్రజలతో నేరుగా సంభాషిస్తూ సమాజ నిర్మాణానికి అవసరమైన విలువలు, యువతకు స్ఫూర్తినిచ్చే అంశాలు, మహిళా శక్తి, స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటి అంశాలపై చేసిన సూచనలు ప్రతి ఒక్కరు అమలు చేయాల్సినవేనని తెలియజేస్తూ ప్రధాని పిలుపు మేరకు పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా తీసుకెళ్లాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర స్వామి, డివిజన్ లోని సీనియర్ బిజెపి నాయకులు మల్లేష్ గౌడ్, కర్క దాకయ్య, సద్గుణ రెడ్డి,శోభారాజన్, నాగరాజు, సతీష్ చారి,భాస్కర్, రమేష్ నాయర్, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి మహిళా నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## కాంతారావు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 22:** కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మాధవరం కాంతారావు పుట్టినరోజు సందర్భంగా స్నేహపురి కాలనీ మోతీనగర్ లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని కాంతారావు ని శాలువాతో సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంతారావు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని రాజేశ్వరరావు ఆకాంక్షించారు

## శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణం జాతర కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఫిబ్రవరి 22:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్కిల్ పరిధిలో గల ఉన్నటువంటి ప్రఖ్యాతగాంచిన చిత్తరమ్మ దేవి ఆలయ ప్రాంగణంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణం , జాతర కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలు , ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు అనంతరం ఆలయ కమిటీ సభ్యులు , అర్చకులు శ్రీనివాస్ గౌడ్ ని శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యపాగ రవి, పెరుమాండ్ల రవి, ముత్యపాగ నర్సింగరావు, ఆర్ బాలరాజు, సాగర్, కూన హరి, రాజేష్, సురేష్, నర్సింగ్,ఆలయకమిటీ సభ్యులు స్థానిక నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు....

## బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్ నాయకులు.



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఫిబ్రవరి 22:** ఈరోజు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ కే.ఎం గౌరీష్ , బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు భారీ ఎత్తున ఉండబోతున్నాయని నియోజక వర్గంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలు, పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరబోతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు ప్రతిపక్షాలు కావలెను!



**నిజం న్యూస్ హైదరాబాద్, ఫిబ్రవరి 22:** ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు జరగడం, మెజారిటీ వచ్చిన వారు పాలించడం మాత్రమే కాదు. అధికార పక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినప్పుడు కళ్లెం వేసే ప్రతిపక్షం ఉండటం ఆ వ్యవస్థకు ప్రాణవాయువు వంటిది. కానీ, నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షం అంటే కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం అనే సంకుచిత అర్థానికి పరిమితమైపోయింది. క్షేత్రస్థాయిలో పోరాటాల కంటే, సోషల్ మీడియా వేదికగా సాగే ట్రోలింగ్ రాజకీయాలే జ్యమేలుతున్నాయి.ఒకప్పుడు ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టించే వ్యవస్థ. అసెంబ్లీలో తార్కికమైన చర్చలు, బయట ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు ఉండేవి. ఒక జీవో విడుదల చేయాలంటే ప్రభుత్వం పదిసార్లు ఆలోచించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రతిపక్షాలు తాము అధికారంలో లేమన్న విషయాన్ని జీర్ణించుకోలేక, ప్రజల కోసం పోరాడటం కంటే తమ ఉనికిని కాపాడుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. అధికార పక్షంపై వ్యతిరేకత పెంచితే చాలు, తదుపరి అధికారం తమకే దక్కుతుందనే ఒక రకమైన నెగటివ్ పాలిటిక్స్ భ్రమలో ప్రతిపక్షాలు ఉండిపోతున్నాయి. అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపడం కంటే, వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాల ద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే ఏకైక అజెండాగా మారిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.ఏపీలో తాము ప్రతిపక్షమే కాదనుకుంటున్న వైఎస్ఆర్‌సీపీఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రశ్నిస్తోంది. గత ఎన్నికల్లో సుమారు 40 శాతం ఓటు బ్యాంకును, కోటి మందికి పైగా ప్రజల మద్దతును పొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కేవలం ప్రతిపక్ష హోదా అనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి సభకు దూరం కావడం ఆ ఓటర్లను వంచించడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో సంఖ్య కంటే గొంతుక ముఖ్యం. పది మంది ఎమ్మెల్యేలు ఉన్నా, వారు సభలో తార్కికంగా మాట్లాడితే ప్రభుత్వం దిగిరాక తప్పదు. కానీ, వైసీపీ నాయకత్వం కేవలం తమపై వస్తున్న కేసుల నుండి రక్షణ పొందడానికో లేదా తమ సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికో పరిమితమవుతోంది. తమ ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పిదాలను సమీక్షించుకుని ప్రజల వద్దకు వెళ్లాల్సింది పోయి, అధికార పక్షం మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది అనే విక్టిమ్ కార్డ్ వేసుకోవడం వల్ల ప్రజల్లో సానుభూతి కంటే అసహనమే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం వైసీపీ చేస్తున్న పోరాటాలన్నీ ఎక్కువగా కేసుల చుట్టూ, పార్టీ నేతల రక్షణ చుట్టూనే తిరుగుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల అమలు , ప్రభుత్వ వైఫల్యాల మీద నిర్మాణాత్మక విమర్శలు చేయడం కంటే, సోషల్ మీడియాలో బురద చల్లడం పైనే ఆ పార్టీ యంత్రాంగం ఎక్కువ దృష్టి పెడుతోంది. రాజకీయం అంటే అధికారం కోసం చేసే ఆరాటం మాత్రమే కాదు, అధికారం లేనప్పుడు ప్రజల కోసం చేసే పోరాటం అన్న సూత్రాన్ని విస్మరించి, కేవలం డిజిటల్ వేదికలకే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నీరసించిపోతోంది. అసెంబ్లీ అనేది ప్రజా సమస్యల చర్చా వేదిక, అక్కడ గొంతు వినిపించకపోతే ప్రతిపక్షంగా తన ఉనికిని కోల్పోయినట్టే అవుతుంది. మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంటులో బేషరతుగా మద్దతు ఇస్తూ, రాష్ట్రంలో అదే పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వంపై పోరాడుతున్నామని చెప్పడం ప్రజల్లో తీవ్ర అయోమయానికి దారితీస్తోంది. ఈ ద్వంద్వ వైఖరి పరోక్షంగా అధికార పక్షానికే సహకరించడమే అవుతుంది. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లుగా సాగుతున్న ఈ రాజకీయం ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. నాయకుడి బలం గెలిచినప్పుడు కాదు, ఓడిపోయినప్పుడు ఎలా నిలబడ్డాడు అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. వైసీపీ సాంకేతిక సాకులను పక్కన పెట్టి, ప్రజా సమస్యలనే అజెండాగా మార్చుకుని అసెంబ్లీకి వెళ్లాలి. ప్రజల పట్ల కనీస బాధ్యత లేని నేతగా మారిన జగన్ రెడ్డి ఇక ఐదు సంవత్సరాలు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డగోలుగా అనుభవించిన జగన్ .. ఇప్పుడు పూర్తిగా ప్రజలను మర్చిపోయారు. వారానికి రెండు రోజులు బెంగళూరు నుంచి రాష్ట్రానికి రావడం, ముందస్తుగా సిద్ధం చేసిన స్క్రిప్టును ప్రెస్ మీట్లలో చదివి వినిపించడం తప్ప ఆయన చేస్తుందేమీ లేదు. ఇప్పటికే ఆ పార్టీ అనుకూల పత్రికల్లో వస్తున్న కథనాలనే మళ్లీ గొంతు విప్పి చెప్పడం వల్ల కొత్తగా ప్రజల్లోకి వెళ్లే సందేశం ఏమీ లేదు. పైగా, ఆయన పర్యటనలు ప్రజా సమస్యల పరిష్కారం కంటే ఆర్భాటపు ఊరేగింపులకే పరిమితమవుతున్నాయి. ఈ క్రమంలో తలెత్తుతున్న భద్రతా లోపాలు సామాన్య కార్యకర్తల ప్రాణాల మీదకువస్తున్నాయి. ప్రజల పక్షాన పోరాడటం అంటే కేవలం కెమెరాల ముందు మాట్లాడటం కాదు, వారి కష్టాల్లో తోడుగా నిలబడటమని వైసీపీ నాయకత్వం గుర్తించలేకపోతోంది. మరోవైపు, అధికార పక్షాన్ని విమర్శించే క్రమంలో వైసీపీ అనుసరిస్తున్న తీరు అత్యంత వివాదాస్పదంగా మారుతోంది. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాల్సింది పోయి, ముఖ్యమంత్రిని, మంత్రులను , వారి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా దూషించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అప్రజాస్వామికం. ఇటువంటి చర్యలు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలను సృష్టించడమే కాకుండా, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలనే వ్యూహాన్ని బయటపెడుతున్నాయి. విమర్శలు విధానాల మీద ఉండాలి కానీ, వ్యక్తుల మీద కాదు అనే కనీస రాజకీయ ధర్మాన్ని విస్మరించి, బూతు పురాణాలతో రాజకీయ కలుషితం చేయడం వల్ల ప్రజల్లో అసహనం పెరుగుతోంది. దీన్ని వైసీపీ గుర్తించడం లేదు. తామింకా ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదని అంగీకరిస్తున్న బీఆర్ఎస్ తెలంగాణ రాజకీయ యవనికపై ఒకప్పుడు సింహగర్జన చేసిన గులాబీ దళం, నేడు ప్రతిపక్ష పాత్రను పోషించడంలో పూర్తిగా వెనుకబడిపోయింది. మేము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా అవతరించలేదు అని ఆ పార్టీ కీలక నేత జగదీష్ రెడ్డి స్వయంగా అంగీకరించడం వారి దైన్యస్థితికి అద్దం పడుతోంది. పదేళ్ల పాటు పరిపాలించిన అనుభవం ఉన్న పార్టీ, ప్రజా సమస్యలపై పదునైన బాణాలను సంధించాల్సింది పోయి, ఇంకా బాధ్యతారాహిత్యంతో కాలం గడుపుతోంది. ప్రజలు మిమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టింది కేవలం ఫామ్ హౌస్‌లకే పరిమితం కావడానికి కాదు, అసెంబ్లీలో ప్రజా గొంతుకగా నిలవడానికి అని ఇప్పటికీ గుర్తించలేకపోతున్నర్రు. బీఆర్ఎస్ ప్రస్తుతం అనుసరిస్తున్న తీరు క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం కంటే, సోషల్ మీడియా వేదికగా అబద్ధాలను వందసార్లు ప్రచారం చేసి నిజం చేయాలనే వ్యూహంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ఆశించడం రాజకీయాల్లో సహజమే, కానీ ఆ వ్యతిరేకతను తమ వైపు తిప్పుకునే విశ్వసనీయత ను వారు కోల్పోతున్నారు. గత పదేళ్ల తమ పాలనలోని లోపాలను కప్పిపుచ్చుకోవడానికి చేసే ప్రయత్నంలో, నేడు వారు చేస్తున్న విమర్శలే బూమరాంగ్ లా మారి వారికే తగులుతున్నాయి. కార్యకర్తలను రోడ్ల మీదకు నడిపించి ప్రజా పోరాటాలు చేయాల్సింది పోయి, కేవలం ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించడం వల్ల పార్టీ క్యాడర్ కు సరైన దిశానిర్దేశం లేకుండా పోయింది. నాయకత్వం లేని సైన్యంలా గులాబీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. రాజ్యాధికారం శాశ్వతం కాదు, కానీ ప్రజా పక్షాన నిలబడటం నిరంతర ప్రక్రియ. బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పటికైనా తన అహంకారాన్ని వీడి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా మారాల్సిన అవసరం ఉందన్న భావన వ్యక్తమవుతోందటే వారింకా తెలుసుకోలేదనే అర్థం. కేవలం సోషల్ మీడియాలో బురద చల్లడం వల్ల అధికారం తిరిగి రాదు. క్షేత్రస్థాయిలో ప్రజల విశ్వాసాన్ని మళ్ళీ పొందాలంటే వాస్తవాలతో పోరాడాలి. ప్రజల తీర్పును గౌరవించి, సభలోనూ, బయటా బాధ్యతాయుతమైన పాత్ర పోషించకపోతే... ప్రజలిచ్చిన బాధ్యతను సరిగ్గా నెరవేర్చనట్లే. అధికారం కోసం చేసే పోరాటాలుగా మారుతున్న పార్టీల తీరు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న రాజకీయ పరిణామాలు కేవలం అధికారం కోసం సాగే పోరాటాలుగా మాత్రమే మిగిలిపోవడం ప్రజాస్వామ్యవాదులను తీవ్రంగా కలచివేస్తోంది. ఒకప్పుడు ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి ఒక దిక్సూచిలా, హెచ్చరికలా ఉండేది. కానీ నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆ పరిస్థితి తలకిందులైంది. ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజల కష్టాలను భుజానికెత్తుకోవాల్సిన పార్టీలు, కేవలం సోషల్ మీడియా వేదికగా సాగే 'డిజిటల్ యుద్ధాల'కే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో ఒక రకమైన రాజకీయ శూన్యత ఏర్పడింది. గణాంకాలను పరిశీలిస్తే, గత కొన్ని ఎన్నికల కాలంగా సోషల్ మీడియా పై రాజకీయ పార్టీలు పెడుతున్న ఖర్చు వందల కోట్లకు చేరింది. కానీ, అదే సమయంలో అసెంబ్లీలో ప్రజా సమస్యలపై జరిగే చర్చా సమయం మాత్రం దారుణంగా పడిపోయింది. గతంలో బడ్జెట్ సమావేశాలు నెల రోజుల పాటు సాగి, ప్రతి పద్దుపై లోతైన చర్చ జరిగేది. కానీ ఇప్పుడు అవి కేవలం వారం పది రోజుల్లోనే ముగిసిపోతున్నాయి. ప్రతిపక్షాలు హాజరు కాకపోవడం, వాకౌట్లు చేయడం, అసెంబ్లీని బహిష్కరించడం వల్ల విలువైన సమయం వృధా అవుతోంది.. దీనివల్ల ప్రభుత్వ యంత్రాంగంపై ఉండాల్సిన పర్యవేక్షణ పూర్తిగా సడలిపోతోంది. తెలంగాణలో బీఆర్ఎస్ పరిస్థితి కూడా దాదాపు ఇలాగే ఉంది. పదేళ్ల పాటు తిరుగులేని అధికారాన్ని అనుభవించిన ఆ పార్టీ, ఓటమి తర్వాత అంతర్గత విభేదాలతో సతమతమవుతోంది. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరుగుతోందని ప్రచారం చేయడం మినహా, ఆ వ్యతిరేకతను తమ వైపు తిప్పుకునే నిర్మాణాత్మక కార్యక్రమాలు ఏవీ చేపట్టడం లేదు. తెలంగాణలో రైతు రుణమాఫీ, ఉపాధి హామీ లేదా సాగునీటి ప్రాజెక్టుల వంటి కీలక అంశాలపై ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టడంలో బీఆర్ఎస్ విఫలమవుతోంది. ఆ పార్టీ నేత జగదీష్ రెడ్డి అన్నట్లు, వారు ప్రతిపక్ష పాత్రను స్వీకరించడానికి సిద్ధంగా లేరనేది అక్షర సత్యం. కేవలం ఐటీ హబ్‌లలో కూర్చుని సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ల ద్వారా ప్రభుత్వంపై బురద చల్లడం వల్ల తాత్కాలికంగా కొంత హడావిడిసృష్టించవచ్చు కానీ, గ్రామీణ స్థాయి ఓటర్ల మనసు గెలవడం అసాధ్యం. తెలంగాణ ఉద్యమ సమయంలో క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైన అదే పార్టీ, నేడు కేవలం డిజిటల్ స్క్రీన్లకే పరిమితం కావడం వారి రాజకీయ పతనానికి సంకేతంగా కనిపిస్తోంది. హిట్ అండ్ రన్ రాజకీయాలకు అలవాటు పడ్డ ప్రతిపక్ష పార్టీలుఅసలైన విషాదం ఏమిటంటే, రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిపక్షాలు హిట్ అండ్ రన్ రాజకీయాలకు అలవాటు పడ్డాయి. ఏదో ఒక ఆరోపణ చేయడం, దానికి సోషల్ మీడియాలో రెక్కలు తొడగడం, ఆ తర్వాత దానిపై వచ్చే నిజనిజాలను పట్టించుకోకుండా మరో కొత్త ఆరోపణకు వెళ్లడం ఒక నిరంతర ప్రక్రియగా మారింది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయని రోజంటూ లేదు. కానీ ఒక్క ఆరోపణలపైనా స్థిరంగా నిలబడి కొట్లాడలేకపోతున్నారు. ఏపీలో అయితే చెప్పాల్సిన పని లేదు. అసలు ఆరోపణలే విపక్షంపై వస్తుంటాయి. సోషల్ మీడియాలో వచ్చే 80 శాతం రాజకీయ పోస్టులు పెయిడ్ వర్కర్లు, బాట్స్ ద్వారా సృష్టిస్తున్నారు. అంటే ప్రజల నిజమైన నాడికి, సోషల్ మీడియాలో కనిపిస్తున్న ట్రెండ్‌లకు మధ్య సంబంధం తెగిపోయింది. అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమవుతుందనే భ్రమలో ఉన్న పార్టీలు, ప్రజలు తమ విచక్షణతో నిజాన్ని గ్రహిస్తారనే విషయాన్ని మర్చిపోతున్నాయి. అసత్య ప్రచారాల వల్ల ప్రభుత్వాలకు వచ్చే నష్టం కంటే, ఆ ప్రచారం చేసే పార్టీల విశ్వసనీయతకే ఎక్కువ ముప్పు వాటిల్లుతోంది. ప్రజల పక్షాన నిలబడి పోరాడే నాయకత్వం లేకపోతే, పాలక పక్షం నిరంకుశంగా మారే అవకాశం ఉంటుంది.రాజకీయ శూన్యత కంటే ప్రతిపక్ష శూన్యత తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం రాజకీయ శూన్యత కంటే ప్రతిపక్ష శూన్యత ఎక్కువగా కనిపిస్తోంది. సమర్థమైన ప్రతిపక్షం లేకపోతే అధికార పక్షం నియంతృత్వ ధోరణితో వ్యవహరించే ప్రమాదం ఉంది. రాజకీయాలు అంటే కేవలం అధికార మార్పిడి కోసం చేసే కుతంత్రాలు కాకూడదు. అవి ప్రజా సేవ కోసం చేసే యజ్ఞం కావాలి. అప్పుడే తెలుగు రాష్ట్రాల కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.తెలుగు రాష్ట్రాలకు ఇప్పుడు కావాల్సింది కేవలం విమర్శించే ప్రతిపక్షం కాదు, పరిష్కారాలను చూపే ప్రతిపక్షం. ప్రభుత్వం చేసే ప్రతి పనిని వ్యతిరేకించడం కాకుండా, అభివృద్ధి పనుల్లో లోపాలను వేలెత్తి చూపిస్తూ, దానికి మెరుగైన ప్రత్యామ్నాయాలను సూచించగలిగే మేధోశక్తి ప్రతిపక్షాలకు ఉండాలి. అసెంబ్లీని గౌరవించడం, సభా మర్యాదలను పాటించడం, ప్రజా సమస్యలపై లోతైన అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే ప్రతిపక్షాలు ప్రజల మద్దతును తిరిగి పొందగలవు. రాజకీయం అంటే కేవలం ఎన్నికల మేనేజ్‌మెంట్ కాదు, అది ప్రజల జీవితాలను మార్చే ఒక గొప్ప సాధనం. ప్రజల నుండి మరింత దూరం కావడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. సమర్థవంతమైన ప్రతిపక్షం లేని రాష్ట్రం దిక్సూచి లేని నావ లాంటిది, కాబట్టి తెలుగు రాష్ట్రాల ప్రతిపక్షాలు తమ అస్తిత్వ పోరాటాన్ని పక్కన పెట్టి ప్రజా హితం కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే.. ఓటములకు కారణాలు చెప్పుకోవడానికి అలవాటు పడాల్సిందే.

## నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ పేర్లతో భారీ మోసం బట్టబయలు: హైదరాబాద్‌లో మాధవి అలియాస్ సిరి చందన అరెస్ట్

### నకిలీ సినిమాల పేరుతో యువతను మోసం చేసిన గ్యాంగ్ మరో 12 నకిలీ దర్శకులు, 12 మంది బాధిత హీరోల వివరాలు త్వరలో వెల్లడి

**నిజం న్యూస్ హైదరాబాద్, తేదీ:22** నెట్‌ఫ్లిక్స్, ప్రముఖ నిర్మాణ సంస్థలు, ఫిల్మ్ చాంబర్ పేర్లను ఉపయోగించి సినిమాల అవకాశాల పేరుతో యువతను మోసం చేస్తున్న ముఠాపై హైదరాబాద్ పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న మాధవి అలియాస్ సిరి చందనను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ ముఠా నెట్‌ఫ్లిక్స్, ఓటీటీ ప్రాజెక్టులు, అలాగే ప్రముఖ నిర్మాణ సంస్థలు అయిన మైత్రి మూవీ మేకర్స్, అన్నపూర్ణ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్స్, డీవీవీ దానయ్య తదితర సంస్థల పేర్లను దుర్వినియోగం చేసినట్లు వెల్లడైంది. అంతేకాకుండా తెలుగు ఫిల్మ్ చాంబర్, ఇండియన్ ఫిల్మ్ చాంబర్, సౌత్ ఇండియన్ ఫిల్మ్ చాంబర్, ఇండియన్ లీగల్ టీమ్ వంటి పేర్లను కూడా నమ్మకంగా చూపించి మోసాలకు పాల్పడినట్లు సమాచారం. ఈ సంస్థతో సంబంధం ఉన్న మరో 12 మంది నకిలీ దర్శకులు , 12 మంది బాధిత హీరోల వివరాలను త్వరలో పోలీసులు వెల్లడించనున్నారు. శంకర్ సినిమాలకు సంబంధం ఉందని చెబుతూ, వాస్తవానికి సంబంధం లేని ప్రాజెక్టుల పేర్లతో కూడా బాధితులను మోసం చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇంకా 50 నుండి 60 వరకు నకిలీ సినిమాల పేర్లతో కొత్తగా మోసాలకు ప్రణాళికలు రూపొందించినట్లు విచారణలో బయటపడింది. ఈ మోసగాళ్ల నెట్‌వర్క్ దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించి ఉండే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో పాల్గొన్న ఇతర సభ్యులను కూడా త్వరలో గుర్తించి అరెస్ట్ చేసే అవకాశముందని అధికారులు తెలిపారు. సినిమాలలో అవకాశాల పేరుతో డబ్బులు అడిగే వ్యక్తుల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

**హెచ్చరిక: సినిమా అవకాశాలు, ఓటీటీ ప్రాజెక్టులు లేదా ప్రముఖ నిర్మాణ సంస్థల పేర్లతో డబ్బులు డిమాండ్ చేసే వారిపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.**

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తల నుంచి నాయకుల వరకు కలిసికట్టుగా పనిచేయాలి: బండి రమేష్

**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 22:** పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్త నుంచి నాయకుడి వరకు కలిసికట్టుగా పనిచేయాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా మధుర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్లో అభినందన సభ ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ కార్యకర్తల గట్టి పోరాటంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలుపొందడం జరిగిందన్నారు బండి రమేష్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పార్లమెంటు తోపాటు కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీ విజయదుందిబీ మోగించడం కార్యకర్తల కష్టంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కూడా కారణమన్నారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో మూడు కార్పొరేషన్ లలోను కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరేస్తుందన్నారు.



నిజం
దృష్టి తెలుగు న్యూస్

సోమవారం 23-02-2026

### భారీ నష్టాలతో మొదలైన

## స్టాక్ మార్కెట్లు.. టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే




అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ నేపథ్యంలో దేశీయ సూచీలు సోమవారం ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఈ వారంలో 5,6 తేదీలలో ఆర్బీఐ ద్రవ్యపరపతి మీటింగ్ జరగనుంది. కీలక వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. ఆదాయపు పన్ను తగ్గింపు కారణంగా ఏఫ్ఎమ్‌సీజీ, బడ్జెట్ కేటాయింపుల వల్ల వ్యవసాయ ఆధారిత స్టాక్స్ మాత్రమే లాభాల్లో కొనసాగుతున్నాయి. శనివారం ముగింపు (77, 505)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం 500 పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో దాదాపు 750 పాయింట్లు కోల్పోయి 76, 756 వద్ద కనిష్టానికి చేరుకుంది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో 672 పాయింట్లు కోల్పోయి 76, 833 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదులుతోంది. ప్రస్తుతం 239 పాయింట్ల నష్టంతో 23, 243 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో పీఐ ఇండస్ట్రీస్, నైకా, యూపీఎల్, టీవీఎస్ మోటార్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. హుడ్కో, మదర్సన్, సైమన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు భారీ నష్టాల్లో ఉన్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 725 పాయింట్ల నష్టాంతో కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ 479 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ ప్రస్తుతానికి 87.16గా ఉంది.

## ఎయిరిండియా 'నమస్తే వరల్డ్' ఆఫర్

**రూ.1,499కే విమాన టికెట్**



ఎయిరిండియా "నమ స్తే వరల్డ్" పేరిట ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రకటించింది. అన్ని రకా ల క్లాస్‌లకు ఇది వర్తిస్తుంది. శనివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన ఈ టికెట్ల విక్రయం గురువారం అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉంటుంది. ఈ టికెట్లపై కస్టమర్లు ఫిబ్రవరి 12వ తేదీ నుంచి అక్టోబరు 31వ తేదీ మధ్యలో తమకు అనుకూలమైన ఏ తేదీల్లో అయినా ప్రయాణించవచ్చు. విదేశీ గమ్యాలను ఎంచుకునే వారు విదేశీ కరెన్సీలో కూడా చెల్లింపులు చేయవచ్చు. దేశీయంగా ఎకానమీ క్లాస్ ధర రూ.1,499, ప్రీమియం ఎకానమీ ధర రూ.3,749, బిజినెస్ క్లాస్ ధర రూ.9,999గా నిర్ణయించారు. అలాగే అంతర్జాతీయ గమ్యాలకు ఎకానమీ క్లాస్ రూ.12,577, ప్రీమియం ఎకానమీ క్లాస్ రూ.16,213, బిజినెస్ క్లాస్ ధర రూ.20,870గా ప్రకటించింది.

## అనిశ్చితికి తెర!



దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం రేంజ్ బౌండ్ నుంచి లాభాల్లో చలించే అవకాశం ఉంది. యూఎస్ ఫెడ్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీ రేట్ల అంశం ముగిసింది. తాజాగా మోదీ సర్కార్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది...

### అనిశ్చితికి తెర!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం రేంజ్ బౌండ్ నుంచి లాభాల్లో చలించే అవకాశం ఉంది. యూఎస్ ఫెడ్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీ రేట్ల అంశం ముగిసింది. తాజాగా మోదీ సర్కార్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. దీంతో మార్కెట్లలో అనిశ్చితికి తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇకపై జియో పొలిటికల్ పరిస్థితులు, ట్రంప్ టారిఫ్సను బట్టి మార్కెట్లు కదలాడొచ్చు. బడ్జెట్ నేపథ్యంలో ఫైనాన్స్, డిఫెన్స్, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇన్‌ఫ్రా, అగ్రి షేర్లు పుంజుకునే అవకాశం ఉంది. ఫియర్ ఇండెక్స్ విక్స్ మళ్లీ 15 శాతం దిగువకు చేరింది.

### స్టాక్ రికమండేషన్స్

**ఫీనిక్స్ మిల్స్:** ఈ షేరు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తోంది. మంచి రివార్డు రేషియోతో దొరుకుతున్నాయి. తాజా ఆర్థిక ఫలితాలు బాగానే ఉన్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. చివరి ఆరు సెషన్లలో ఈ షేరు 21 శాతం మేర లాభపడటం గమనార్హం. గత శనివారం రూ.1,764 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,950/ 2,000 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,650 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.

**కావేరీ సీడ్స్:** జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ కౌంటర్‌లో 32 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కొన్ని నెలల సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత చక్కని మూమెంటమ్ ప్రదర్శిస్తోంది. నిఫ్టీతో పోలిస్తే జోరు కనబరుస్తోంది. ప్రస్తుతం ఆకర్షణీయమైన జోన్‌లో లభిస్తోంది. గత శనివారం రూ.965 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.940 శ్రేణిలో ప్రవేశించి రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.910 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.

## సంచలనం.. తెలంగాణలో ప్రధాన పార్టీలకు పోటీగా 'కూటమి'




**నిజం న్యూస్ హైదరాబాద్ ,ఫిబ్రవరి 22 ౦+:** తెలంగాణ రాజకీయాలు రోజురోజుకు ఆసక్తిగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఒకరిపై మరొకరు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్న వేళ ఈ 3 పార్టీలకు చెక్ పెట్టాలంటూ రాష్ట్రంలో మరో రాజకీయ కూటమి ఏర్పాటైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా 'తెలంగాణ రాజకీయ కూటమి' పేరుతో కొత్త వేదిక ఆవిర్భవించింది. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ లక్ష్మణ్, తెలంగాణ విఠల్, ప్రొ.గాలి వినోద్, రాష్ట్రీయ లోక్ దళ్ తెలంగాణ అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ వంటి మేధావులు రాష్ట్రంలో మూడో శక్తి అవసరాన్ని పేర్కొన్నారు. ప్రధానంగా రాబోయే ఎన్నికల్లో ఈ 3 పార్టీలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఈ కూటమి వ్యూహరచన చేస్తోంది. కూటమి ఏర్పాటుతో తెలంగాణలో ఆసక్తికర రాజకీయ వాతావరణం ఏర్పడింది.

## జీవనశైలి ద్రవ్యోల్బణం



ఇన్ఫోగ్రాఫిక్

ఉద్యోగంలో చేరిన కొత్తలో వచ్చిన కొద్ది జీతంతోనే సర్దుకుపోతారు. కెరీర్‌లో, జీతాల్లో కాస్త వృద్ధి కనిపించగానే జీవనశైలిని మారిపోతుంది. ఇప్పుడు కాకపోతే మరింకెప్పుడు అని ఖర్చులకు పోతారు. అంతేతప్ప ఎక్కువగా వచ్చిన మొత్తాన్ని పొదుపుగా మార్చుకోవాలని మాత్రం అనుకోరు. కానీ, ప్రైవేటు కొలువుల్లో ఉద్యోగం ఊడిపోవడం, ఆదాయం తగ్గిపోవడం వంటి రిస్కులు ఉంటాయి. దీంతో దుబారాకు అలవాటు పడ్డవాళ్లు%ొ% ఒక్కసారిగా పైసలకు కటకట ఏర్పడటంతో కష్టాలకు తట్టుకోలేరు. కాబట్టి, ఈ వాస్తవాన్ని గ్రహించి జీతాన్ని వాడుకోవాలి. అనవసరంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకూడదు. జీతం పెరిగే కొద్దీ ఖర్చులను కూడా అతిగా పెంచుకునే పద్ధతిని 'లైఫ్ స్టయిల్ క్రీప్', 'లైఫ్ స్టయిల్ ఇన్‌ఫ్లేషన్' అంటారు. ఇదెంతవరకు సాగుతుందంటే చివరికి మన దగ్గర పొదుపు కోసం పైసలే ఉండని స్థితికి చేరుకుంటుంది. అంటే ఇదో జీవనశైలి ద్రవ్యోల్బణం అన్నమాట.

### కారణాలుజి

'ఇప్పుడు కొనండి, తర్వాత చెల్లించండి' అనే మార్కెటింగ్ వ్యూహాలు, క్రెడిట్ కార్డులు, ఈఎంఐలు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండటం. దీంతో ధర ఎక్కువగా ఉన్న వస్తువులను అవసరం ఉన్నా లేకపోయినా సులువుగా కొనేస్తారు. ఆదాయం హరించుకుపోయేలా చేసుకుంటారు. విలాసవంతమైన జీవితాన్ని కోరుకోవడం కూడా దీనికి ఓ కారణం. నవతరం (జనరేషన్ జడ్, మిలీనియల్స్) సోషల్ మీడియా వేదికగా సాగే సౌందర్యం, ఫిట్‌నెస్, ఆరోగ్య సంరక్షణ చిట్కాలకు ప్రాధాన్యం ఇవ్వడం. తమకంటే మరింత మెరుగైన జీవిత విధానం ఉన్నవారితో పోల్చుకోవడం. ఇతరులు విలాసంగా, హాయిగా బతికేస్తుంటే%ొ% తామెందుకు మామూలుగా ఉండిపోవాలనే తత్వం కూడా లైఫ్‌స్టయిల్ ఇన్‌ఫ్లేషన్‌కు కారణమవుతుంది.

### ఇలా తగ్గించుకోండి..

ఇంటి అద్దె, కిరాణా సరకులు, రవాణా ఖర్చులు, ఇతర ఖర్చుల కోసం ప్రాధాన్యంతో కూడిన బడ్జెట్ తయారుచేసుకోవాలి. తాత్కాలిక ఆనందాన్ని, గుర్తింపును తెచ్చిపెట్టే కొనుగోళ్లను వాయిదా వేసుకోవాలి. ఆర్థిక సుస్థిరత్వం, దీర్ఘకాలిక సంతృప్తికి చోటివ్వాలి. మనకు తేలిగ్గా అందుబాటులో లేని సౌకర్యాల కోసం డబ్బును పొదుపుచేయండి. ఇలాచేస్తే దుబారాకు అవకాశం ఉండదు. అనవసర ఖర్చుల గురించి తెలుసుకునేందుకు మీ పర్సు ఎలా ఖాళీ అయిపోతున్నదో గమనించుకోండి.

### ఎవరిలో..

ముఖ్యంగా నవతరం ఉద్యోగుల్లో ఈ తత్వం అధికంగా కనిపిస్తుంది. దీనికి కొవిడ్- 19 మహమ్మారి తోడైంది. దీంతో ఆరోగ్యం కోసం ఆహారం, ఫిట్‌నెస్, వైద్యం ఖర్చులు పెంచుకుంటున్నారు. ఇలా ఆరోగ్యంపై శ్రద్ధతో ఖర్చులు పెంచుకోవడాన్ని 'హెల్తీ లైఫ్ స్టయిల్ క్రీప్' అంటారు.

## 84 వేలు దాటేసిన బంగారం.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే

బంగారం వెండి ధరలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరవవుతున్నాయి. కొన్ని రోజుల క్రితం వరకు 80 వేలకు దిగువన కొనసాగిన బంగారం ఒక్కసారిగా పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం బంగారం దిగుమతులపై పన్నును పెంచబోతుండడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఫిబ్రవరి 3న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 84, 480కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 77, 440కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 84, 630కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 77, 590కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 84, 480కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 77, 440కి చేరింది. వెండి ధరలు భారీగా పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు)
(24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 84, 480, రూ. 77, 440
విజయవాడలో రూ. 84, 480, రూ. 77, 440
ఢిల్లీలో రూ. 84, 630, రూ. 77, 590
ముంబైలో రూ. 84, 480, రూ. 77, 440
వడోదరలో రూ. 84, 530, రూ. 77, 490
కోల్‌కతాలో రూ. 84, 480, రూ. 77, 440
చెన్నైలో రూ. 84, 480, రూ. 77, 440
బెంగళూరులో రూ. 84, 480, రూ. 77, 440
కేరళలో రూ. 84, 480, రూ. 77, 440
పుణెలో రూ. 84, 480, రూ. 77, 440



ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)
హైదరాబాద్‌లో రూ. 106, 900
విజయవాడలో రూ. 106, 900
ఢిల్లీలో రూ. 99, 400
చెన్నైలో రూ. 106, 900
కోల్‌కతాలో రూ. 99, 400
కేరళలో రూ. 106, 900
ముంబైలో రూ. 99, 400
బెంగళూరులో రూ. 99, 400
వడోదరలో రూ. 99, 400
అహ్మదాబాద్‌లో రూ. 99, 400


గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడూ మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

## ట్రంప్.. టారిఫ్.. టెర్రర్!



### అమెరికా అధ్యక్షుడి సుంకాల మోత.. వాణిజ్య యుద్ధ భయాలతో గజగజ ఈక్విటీ మార్కెట్ సూచీలు కుదేలు సరికొత్త రికార్డు కనిష్ఠానికి రూపాయి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి బంగారం మళ్లీ ఎగబాకుతున్న ముడి చమురు

అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశాడు. చైనా, కెనడా, మెక్సికో.. ఇలా ఒక్కో దేశంపై వరుసపెట్టి సుంకాల మోత మోగించేస్తున్నాడు. దాంతో ఆ దేశాలూ ప్రతికార చర్యలకు సిద్ధమవుతున్నాయి. ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చని మార్కెట్ వర్గాలు భయాందోళనలకు గురవుతున్నాయి. ఈక్విటీ పెట్టుబడులను వారు పెద్దఎత్తున వెనక్కి తీసుకుంటుండటంతో ప్రపంచ మార్కెట్లు నష్టాల్లో పయనిస్తున్నాయి. మరోవైపు టారిఫ్ షాక్‌తో మన కరెన్సీ మరింత బక్కచిక్కింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ సరికొత్త జీవిత కాల కనిష్ఠానికి పతనమైంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారానికి డిమాండ్ పెరగడంతో ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠానికి ఎగబాకాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలూ మళ్లీ పుంజుకుంటున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రూపాయి మరింత క్షీణించవచ్చని, పసిడి పరుగు ఆపక పోవచ్చని విశ్లేషకులంటున్నారు.



### ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 750 పాయింట్లు డౌన్

ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం భారీ నష్టాలతో ట్రేడింగ్ ఆరంభించాయి. సెన్సెక్స్ ఒక దశలో 749.87 పాయింట్లు కోల్పోయి 76,756.09 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి కాస్త కోలుకున్న సూచీ.. 319.22 పాయింట్ల నష్టంతో 77,186.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 121.10 పాయింట్లు కోల్పోయి 23,361.05 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 నష్టపోయాయి. ఎల్ అండ్ టీ షేరు 4.64 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ షేర్లు 2 శాతానికి పైగా విలువను కోల్పోయాయి. ప్రధాన షేర్లతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి కంపెనీల స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి అధికమైంది. దాంతో బీఎసఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.77 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.89 శాతం పతనమయ్యాయి. రంగాల వారీ సూచీల్లో క్యాపిటల్ గూడ్స్ అత్యధికంగా 4.29 శాతం క్షీణించగా.. ఇండస్ట్రియల్స్ 3.79 శాతం, పవర్ 3.30 శాతం నష్టపోయాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ ఇండెక్స్‌లు 2 శాతానికి పైగా నష్టపోయాయి. బీఎసఈలో మొత్తం 4,184 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,962 నేలచూపు చూశాయి. 1,075 లాభపడగా..147 యథాతథంగా ముగిశాయి. 117 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠానికి జారుకోగా.. 3 స్టాక్స్ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. కాగా, మదుపరుల సంపదగా పరిగణించే బీఎసఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.419.54 లక్షల కోట్లకు (4.82 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

### రూ.87 దాటిన డాలర్

భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్కరోజే 49 పైసలు క్షీణించి రూ.87.11 వద్ద ముగిసింది. ఒక దశలో ఎక్స్ఛేంజ్ రేటు ఏకంగా 67 పైసల నష్టంతో రూ.87.29 స్థాయికి చేరినప్పటికీ.. మన కరెన్సీ మళ్లీ కాస్త కోలుకుంది. డాలర్‌తో మారకం రేటు రూ.87 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. టారిఫల ప్రభావంతో అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలపడటంతోపాటు ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు కారణమయ్యాయి. ముడి చమురు ధరల పెరుగుదల కూడా రూపాయిపై ఒత్తిడి పెంచింది. డాలర్ క్రమంగా బలపడుతుండటంతో పాటు మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతున్న నేపథ్యంలో రూపాయిపై ఒత్తిడి కొనసాగనుందని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు. ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటే మన కరెన్సీకి కొంత మద్దతు లభించవచ్చన్నారు. కాగా, 6 అంతర్జాతీయ కరెన్సీలతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ 1.01 శాతం పెరిగి 109.46కు చేరుకుంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒక దశలో 1.41 శాతం పెరిగి 76.74 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

### గోల్డ్ ఏ: రూ.85,000

పసిడి మళ్లీ కొండెక్కుతోంది. దేశీయంగా ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత బంగారం రేటు 10 గ్రాములు మరో రూ.400 పెరుగుదలతో రూ.85,300కు చేరుకుంది. పసిడి రూ.85,000 మైలురాయిని దాటడం ఇదే తొలిసారి. వెండి సైతం కిలోపై రూ.300 పెరుగుదలతో రూ.96,000 చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు ఎగబాకడంతో పాటు దేశీయంగా రూపాయి విలువ పతనం ఇందుకు ప్రధాన కారణమయ్యాయని బులియన్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఈక్విటీల్లోని పెట్టుబడులను క్రమంగా బులియన్ వైపు మళ్లిస్తున్నారని బులియన్ నిపుణులు చెబుతున్నారు.